రైతుల కోసం!



రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కోసం పరికరాలు

- రైతువేదికల్లో దృశ్య శ్రవణ మాధ్యమాలు
- సాంకేతికతవైపు అడుగులు
- వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అవగాహన
- ప్రతివారం రైతునేస్తం కార్యక్రమాలు
- శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో ఉపయోగం

నవాబుపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ పనులు, సాగు పద్ధతులు తదితర విషయాలను రైతులకు చేరవేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు అన్నదాతలకు పలు సూచనలు, సలహాలు, అందించడానికి రైతువేదికల్లో దృశ్య శ్రవణ మాధ్యమాలు ఏర్పాటు చేశారు. మండలంలో నవాబుపేట, ఎల్లకొండ, చించల్‌పేట, పులుమామిడి, మీనపల్లికలాన్ గ్రామాల్లో ఐదు వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. నవాబుపేట, ఎల్లకొండ, చించల్‌పేట గ్రామాల్లో తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు గానూ దృశ్య శ్రవణ మాధ్యమాలను ఏర్పాటు చేశారు. దాదాపు మూడు లక్షలకు పైగా వెచ్చించి ఏర్పాటు చేశారు. బీఎస్ఎన్ఎల్, టీఎస్ స్వాన్ వంటి ప్రభుత్వ నెట్‌వర్క్‌లను వినియోగిస్తున్నారు. వాటి ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని మూడు రైతువేదికల్లో ఆయా కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం పంటల సాగు, పథకాలు, రైతుల సాదకబాధకాలు చర్చించుకోవడం కోసం మండలాల్లో క్లస్టర్‌కు ఒకటి చొప్పునా దాదాపు మండాలనికి ఐదు రైతు వేదికలను నిర్మించారు. అక్కడ టీవీల ద్వారా నేరుగా రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు ప్రసార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రైతు నేస్తంతో..

వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పాడి, మత్స్య, నీటి పారుదల, పంటల సాగులో సస్య రక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేరుగా ప్రసారం చేస్తున్నారు. వారికొచ్చిన సందేహాలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు కూడా వెసులు బాటు కల్పించారు. అందుకు అనుగుణంగా దృశ్యశ్రవణ మాధ్యమాలను అందుబాటులోకి తీసుకవచ్చారు. ప్రతి మంగళవారం రైతునేస్తం ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పాడి, మత్స్య, నీటి పారుదల, పంటల సాగులో సస్యరక్షణ చర్యలు అనుబంధ రంగాల్లో నిపుణులు, శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలను రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన టీవీల్లో ప్రత్యక్షంగా ప్రసారాలను వీక్షించి సందేహాలను రైతులు నివృత్తి చేసుకోవచ్చు. అదే సమయంలో రైతులు శాస్త్రవేత్తలతో ముఖాముఖిలో పాల్గొని ఆయా సందేహాలను నివృతిచేసుకోవచ్చు. ప్రతివారం ఒక అంశంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నారు.

“రైతు వేదికల్లో ప్రతివారం



రైతు వేదికల్లో ప్రతివారం రైతు నేస్తం నిర్వహిస్తారు. ఇది వరకే ప్రభుత్వం మండలానికి మూడు దృశ్య శ్రవణ మాధ్యమాలను సరఫరా చేసింది. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సూచనలు, సలహాలు పొందవచ్చు. అనుమానాలను పరిష్కరించుకునేందుకు నేరుగా అధికారులు, శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం కల్పించారు. రైతులకు ఎలాంటి సూచనలు కావాలన్నా, ఇబ్బందులు ఉన్నా ఆయా సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుంది.

– జ్యోతి, మండల వ్యవసాయాధికారి, నవాబుపేట

అస్తవ్యస్తంగా గాజీపూర్ రోడ్డు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో అంతర్గత రోడ్డు సక్రమంగా లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొనమ్మ దేవాలయం వెనుకాల నుంచి మసీదు, చుట్టు పక్కల ఇళ్లు ఉన్నాయి. ఈ కాలనీలో సీసీరోడ్డు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్డంత బురదమయంగా తయారవుతుంది. వర్షాకాలం వస్తే అక్కడ నీరుచేరి గుంతలుగా మారుతుంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


అంతర్గతరోడ్డు దుస్థితి

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

- హాజరు కానున్న డీసీసీ అధ్యక్షుడు టీఆర్ఆర్
- మండల నూతన కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

తాండూరు: నియోజకవర్గంలోని తాండూరు పట్టణంతో పాటు నాలుగు మండలాల్లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు ఆదివారం పేర్కొన్నాయి. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశాలకు జిల్లా అధ్యక్షుడు రామ్మోహర్‌రెడ్డి, పార్టీ పరిశీలకులు వినోద్‌కుమార్‌రెడ్డి, రాంశెట్టి నరేందర్ హాజరవుతారని తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు బషీరాబాద్ మండల కేంద్రంలో ఉంటుందని, మధ్యాహ్నం 12 గంటలకు యాలాల మండలంలో, ఒంటి గంటకు తాండూరు మండలం, 2 గంటలకు పెద్దేముల్ మండలం, సాయంత్రం పట్టణ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తారని వివరించారు. పార్టీ పదవులు ఆశిస్తున్న ఆశావహుల నుంచి పార్టీ పరిశీలకులు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

యాలాల మండలం పగిడిపల్లి గ్రామం నుంచి పటేల్ చింత తండా వరకు రూ.1.85 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులు, బషీరాబాద్ మండలం ఏకాంబర రామలింగేశ్వర దేవాలయం కమాన్ నుంచి ఆలయం వరకు రూ.95లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

మహేందర్‌రెడ్డి మృతి బాధాకరం

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు రైతు పట్లోల్ల మహేందర్‌రెడ్డి పొలం వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదివారం బార్వాద్ గ్రామానికి వెళ్లి మహేందర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మహేందర్‌రెడ్డి రాజకీయ పార్టీలకు అతీతంగా అందరితో సౌమ్యుడుగా మసలుకునేవారని గుర్తు చేశారు. మహేందర్‌రెడ్డి అకాల మరణం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

బీజేపీ నాయకుల నివాళి

మహేందర్‌రెడ్డి మృతి పట్ల పలువురు బీజేపీ నాయకులు నివాళులర్పించి సంతాపం తెలిపారు. పార్టీకి తీరని లోటని కొనియాడారు.

కురిసిన వర్షం

- ఎండిపోయిన మొక్కలకు జీవం
- ఆనందంలో అన్నదాతలు

తాండూరు రూరల్: వర్షం కోసం ఎన్నో రోజులుగా చూసిన ఎదురు చూపులకు ఆదివారం సాయంత్రం వాన పడడంతో ఎండిపోతున్న మొక్కలకు జీవం పోసినట్లయ్యింది. సంగెంకలాన్, మల్కాపూర్, ఐనెల్లి, జీనుగుర్తి, కరన్‌కోట్, బిజ్వార్, నారాయణపూర్, ఉద్దాండపూర్, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో వాన పడింది. ఇప్పటికే విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులకు వర్షం పడకపోవడంతో ఆందోళన చెందారు. ఆదివారం కురిసిన వర్షానికి వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పడితే పత్తి, కంది, మినుము, పెసర, జొన్న పంటలకు లాభం చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సీనియర్ పాత్రికేయుడు మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

ధారూరు: మండల పరిధిలోని కొండాపూర్‌కలాన్ గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు డి. చంద్రశేఖర్ ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వివిధ దిన పత్రికల్లో పనిచేశారు. భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతిపై వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

రూలింగ్ పార్టీకి కొమ్ముకాస్తున్న తహసీల్దార్

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్: ఒక పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ.. ఇతర పార్టీ వారిపై తమ అధికారాన్ని ప్రయోగిస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు కేఎస్ రత్నం ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టానికి లోబడి ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ సమానంగా అందేలా చూడాల్సిన అధికారి, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పనిచేస్తున్నాడన్నారు. హైతాబాద్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 8లోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలైన కొందరు తమకు అసైన్‌చేసిన భూమిలో గత పది ఇరవై సంవత్సరాల నుంచి ఇండ్లు, షెడ్లు నిర్మించుకొని ఉపాధి పొందుతున్నారన్నారు. వారు అక్రమ కట్టడాలు కట్టుకున్నారంటూ, వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారివి కూల్చివేయడం, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారివి వదిలివేయడంతోనే తహసీల్దార్ అనుసరిస్తున్న పక్షపాత ధోరణి అర్థమవుతుందన్నారు. కంపెనీలకు మట్టిని అమ్ముకుంటున్న మాఫీయాకు కొమ్ము కాస్తూ పెద్దవేడు, సోలీపేట్ గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గుల్ల చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రజలను ఇబ్బందులకు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హైతాబాద్ అక్రమ కూల్చివేతలపై అక్రమంగా మట్టి తరలింపులపై ఉన్నతస్థాయి విచారణకు పోతామన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు వైభవ్‌రెడ్డి, రాఘవేందర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సతీశ్ తదితరులు ఉన్నారు.

నేడు కేజీరెడ్డి కళాశాలలో ‘కేజీఆర్ ఇడియాథాన్’

హాజరు కానున్న మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ‘సామాజిక ప్రభావం’ అనే అంశంపై ‘కేజీఆర్ ఇడియాథాన్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ఏఓ రవికిరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సమాజ, సామాజిక సమస్యలపై ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రదర్శిస్తూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి


పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటేలా సమష్టిగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామానికి చెందిన వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు వారు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పని చేయాలన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థలన్నింటిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులందరికీ రేషన్‌కార్డులు వస్తాయని, ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, శేఖర్, రవి, కృష్ణ, ప్రవీణ్‌కుమార్, రామస్వామి, సత్తయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

యాచారం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామాల్లో ఏడాది క్రితం రెండు వేలకు పైగా భూ సమస్యలున్నాయని, నేటికీ అవి అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. భూ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారే కానీ.. అవి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రస్తుత సదస్సులో అందిన అర్జీలకు పరిష్కారం మార్గం చూపాలని కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో మండల కళాకారులు


కనకదుర్గా ఆలయం వద్ద ఒగ్గుడోలు కళాకారులు

బొంరాస్‌పేట: తెలంగాణ భాషా సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలో నాందార్‌పూర్‌కు చెందిన శ్రీమల్లికార్జున ఒగ్గుడోలు కళాకారుల బృందం విజయవాడలోని కనకదుర్గమ్మ బోనాలకు హాజరయ్యారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో టీమ్‌లీడర్ బీరు బృందం నిర్వహించిన ఆయా విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమరంలో ఒగ్గుడోలు కళాకారులు కిష్టప్ప, మల్లేశ్, నవీన్, మహేశ్, నితిన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి


గ్రామస్తులకు విరాళం అందిస్తున్న వైభవ్‌రెడ్డి

చేవెళ్ల: మహనీయులు చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆయన ఆదివారం గ్రామస్తులకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే మహనీయుల విగ్రహాలు ప్రజల్లో వారి ఆశయాలను గుర్తు చేస్తాయన్నారు. ప్రతీ ఒక్కరికి స్ఫూర్తి దాయకంగా ఉంటాయన్నారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంతోనే మన దేశంలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. అలాంటి మహనీయుల విగ్రహాలు ప్రతి గ్రామంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

కేశంపేట: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ శివారులోని పోడగుట్టతండాలో రాంబాల్‌నాయక్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా గోప్య నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం రాంబాల్‌నాయక్‌తో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, అల వేంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎల్లగమోని రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


గోప్యనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

- అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతున్న విద్యుత్
- ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని వినతి

మొయినాబాద్‌రూరల్: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలం, మున్సిపల్‌లోని చాలా గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతోంది. మండల పరిధిలోని నదీమ్‌నగర్ కస్తూర్బా గాంధీ పాఠశాల ఎదురుగా, అజీజ్‌నగర్ గ్రామంలో వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు వెలుగుతూనే ఉన్నాయి. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో కూడా కూడా ఆన్, ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నదీమ్‌నగర్ కస్తూర్బా గాంధీ పాఠశాల గేటు వద్ద వెలుగుతున్న వీధి దీపం


హిమాయత్‌నగర్‌లో..

క్లుప్తంగా

మన్‌కీ బాత్ వీక్షించిన నేతలు

షాద్‌నగర్: ప్రధాని మోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అరోమా రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్‌కీ బాత్ ప్రత్యక్ష ప్రసారాన్ని పార్టీ అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా ఆధ్వర్యంలో తెరపై ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్‌కుమార్, నాయకులు మొగిలి నర్సింలు, మల్లెల ఆనంద్, అంబటి శివశంకర్, పిల్లి సురేష్‌బాబు, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా టాయిలెట్లు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


కరన్‌కోట్‌లో నిరుపయోగంగా టాయిలెట్లు

తాండూరు రూరల్: మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం కరన్‌కోట్‌లోని ఎస్సీ కాలనీలో సామూహిక టాయిలెట్లు, మరుగుదొడ్లు వృథాగా ఉన్నాయి. గతేడాది డీఎంఎఫ్‌టీ నిధులు రూ.12లక్షలతో సంబంధిత అధికారులు మరుగుదొడ్లు నిర్మించారు. కొన్ని రోజులు బాగానే ఉన్నాయి. ఆ తర్వాత నీటి సరఫరా లేకపోవడంతో వృథాగా తయారయ్యాయి. దీంతో ఎస్సీ కాలనీలో బహిర్భుమికి వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు


సభకు తరలిన మండల నాయకులు

బొంరాస్‌పేట: తెలంగాణ గాయకుడు దివంగత సాయిచంద్ వర్ధంతి రెండో సభ సందర్భంగా నిర్వహించిన విగ్రహావిష్కరణకు మండలం నుంచి పెద్ద ఎత్తున దళితసంఘాల నాయకులు తరలివెళ్లారు. ఆయన స్వగ్రామం అమరచింతలో ఎరసప్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సభకు మండల అంబేడ్కర్‌సంఘాలు, దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్, కళాకారుల సంఘాల నాయకులు, డప్పు శ్రీనివాస్, కొత్తూరు బాలు, ప్రకాశ్, దీపక్, బాలకిష్టయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి అనుగ్రహం కోసం పూజలు


మూసీనది వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

నవాబుపేట: వరుణుడి అనుగ్రహం కోసం ఎల్లకొండ గ్రామస్తులు పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని కోరుతూ మూసీనదిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లకొండ గ్రామంలోని పురాతన శివాలయ పార్వతీపరమేశ్వరుల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. మూసీనదిలోని శివలింగానికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం సామూహిక వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భరత్ రెడ్డి, పూజారి శ్రీపాల్ పంతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన మొహర్రం


కుల్కచర్లలో ఏర్పాటు చేసిన పీర్లు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మొహర్రం పురస్కరించుకుని శనివారం రాత్రి పీర్లను ఏర్పాటు చేశారు. హిందూముస్లింల ఐక్యతకు ఈ వేడుకలు నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు. 10రోజుల వరకు ప్రత్యేకంగా పూజలు, ప్రార్థనలు నిర్వహిస్తారు.